క్లుప్తంగా

క్రీడాకారులకు ప్రశంసలు



బాడీ బిల్డింగ్ విజేతలను ప్రశంసిస్తున్న డీఎస్పీ

నగరి: బాడీ బిల్డింగ్ పోటీలో ప్రతిభ కనబరిచిన వారిని డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ ప్రశంసించారు. ఈ నెల 27వ తేదీన ఎస్‌ఆర్ పురంలో జరిగిన బాడీ బిల్డింగ్ కాంపిటీషన్‌లో విజేతగా నిలిచిన నగరికి చెందిన అస్లాం, పుత్తూరుకు చెందిన దినేష్‌లకు బహుమతులు ఇచ్చి ప్రోత్సహించారు. మరిన్ని పోటీల్లో రాణించడానికి అవసరమైన సహకారం అందిస్తానన్నారు.

విద్యుత్ బకాయిలు వసూలు చేయండి



పెనుమూరు ఏఈ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్

పెనుమూరు(కార్వేటినగరం): పేరుకుపోయిన విద్యుత్ బకాయిలను వసూలు చేయాలని, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని ఆ శాఖ ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ అన్నారు. మంగళవారం పెనుమూరు విద్యుత్ కార్యాలయంలో మండలంలోని బకాయిలు, వసూళ్లు, విద్యుత్ సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల వారీగా బకాయిల వివరాలు, వసూళ్లను పరిశీలించారు. ఎస్సీ, ఎస్టీలు 200 యూనిట్స్ దాటివాడినవారి సర్వీసులను పరిశీలించి బకాయిలు వసూలు చేయాలన్నారు. గృహవినియోగ బకాయిలను ఎప్పటికప్పుడు వసూలు చేయాలని ఆదేశించారు. విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. అనంతరం కార్యాలయానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట జీడీనెల్లూరు ఏడీఈ శేషాద్రిరెడ్డి, పెనుమూరు ఏఈ తులసీ ప్రసాద్ ఉన్నారు.

ప్రజల పక్షాన పోరాటం ఆగదు



పుత్తూరులో సీపీఐ ర్యాలీ

పుత్తూరు: సీపీఐ ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మురళి స్పష్టం చేశారు. మంగళవారం పుత్తూరు మండల సీపీఐ 11వ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన చరిత్ర సీపీఐ సొంతమన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి వందేళ్లు పూర్తి చేసుకొన్న సందర్భంగా ఈనెల 24న నగరిలో జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ, కార్మిక, కర్షక సమస్యలతోపాటు పలు సమస్యలపై పోరాటాలు సాగిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచి ప్రజల నడ్డివిరిచిందన్నారు. గత ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లను పగలగొట్టండని పిలుపునిచ్చిన తెలుగుదేశం అగ్రనాయకులే నేడు వాటిని అమర్చే పనిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు జీతాలు పెంచుతామన్న మాటను మరిచారన్నారు. భవిష్యత్తు పోరాటాలపై ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, రాధాకృష్ణ, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, గోపి, మనీ, శరవణ, విజయ్, సెల్వరాజ్, రమేష్, లావణ్య, ధనలక్ష్మి, రోజా తదితరులు పాల్గొన్నారు.

వారాహి శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు



పుత్తూరు: పరమేశ్వర మంగళం గ్రామ సమీపాన నగరి కనంమిట్ట వద్ద వెలసి ఉండు దక్షిణ కాళీ వారాహి శక్తిపీఠంలో మంగళవారం పంచమి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, కాళీవారాహి మాతను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి అమావాస్య, పౌర్ణమి రోజుల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టెంపుల్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు తెలిపారు.

మోతాదు మించితే అనర్థం

- పచ్చిరొట్ట ఎరువులు శ్రేయస్కరం



పొలంలో వేసిన పచ్చి రొట్ట ఎరువు

వడమాలపేట(విజయపురం): పంటకు ఘన, ద్రవ ఎరువులు, పచ్చిరొట్ట, పచ్చి ఆకు ఎరువులు, జీవన ఎరువులు ముఖ్యపోషకాలు, పంట ఎదుగుదలకు సుమారు 16 రకాల పోషకాలు అవసరం. వీటిలో నత్రజని, భాస్వరం, పొటాషియం, ఎక్కువ మోతాదులో అవసరమవుతాయి. ఉప పోషకాలైన కాల్షియం, మెగ్నీషియం, గంధకం తక్కువ మోతాదులో అవసరం. ఇనుము, మాంగనీస్, రాగి, జింకు, బోరాన్, క్లోరిన్, అల్యూమినియం, నికెల్ తదితర సూక్ష్మ పోషకాలు కూడా పంటకు తక్కువ మోతాదులోనే అవసరమవుతాయి. కానీ రైతులకు అవగాహన లేక మోతాదుకు మించి వేస్తుంటారని, దీని వల్ల ఫలితం ఏ మాత్రం ఉండకపోవడంతో పాటు అదనపు ఖర్చు అవుతుందని ఏఓ రజిని కుమారి తెలిపారు. ఏ ఎరువు ఎందుకు ఉపయోగపడుతుందోనని వివరాలిలా ఉన్నాయి.

పొటాషియం

మొక్కల్లో జరిగే జీవ రసాయన క్రియలను ఎంజైమ్‌ల తయారీకి పొటాషియం, అవసరం. మొక్కకు రోగనిరోధక శక్తిని ఇస్తుంది. పురుగు తెగులు ఆశించకుండా కాపాడుతుంది. వాతావరణ ప్రభావాల నుంచి పంటను రక్షించడమే కాకుండా కాయలు, గింజలు పండ్ల నాణ్యత పెరుగుతుంది.

భాస్వరం

భాస్వరంతో వేర్ల పెరుగుదలకు గింజ కడుతుంది. మొక్క పెరుగుదలకు కొమ్మలు తొడగడానికి అవసరం. నేలలోని సేంద్రియ పదార్థం చివికేలా చేస్తుంది. ప్రొటీన్, ఎంజైమ్‌ల తయారీకి ఉపయోగపడుతుంది. పుష్పజాతి పంటలకు ఎక్కువ భాస్వరం అవసరం.

మెగ్నీషియం

మెగ్నీషియం ఎంజైమ్‌లలో చురుకుదనం కలిగిస్తుంది. నేలలోని భాస్వరం గ్రహించడంలో తోడ్పడుతుంది.

పచ్చిరొట్ట ఎరువులు

పంటకు అవసరమయ్యే పోషకాలు సేంద్రియ రూపంలో సమర్థవంతంగా అందించాలంటే పచ్చిరొట్టను బాగా అందించే పంటలను అదేపొలంలో ముందుగా వేసుకోవాలి. తక్కువ వనరులతో బాగా పెరిగిన పంటలను సుమారు రెండు నెలల ముందే పొలంలో విత్తుకోవాలి. ఆ పంట పూతకు వచ్చే సమయంలో భూమిలో కలియదున్నాలి. దున్నిన రెండుమూడు వారాలకు బాగా కుళ్లడంతో విడుదలైన పోషకాలు పొలంలో విత్తిన పంటకు అందుతాయి. ఉదాహరణకు మినుము, అలసంద, జీలుగ, పెసర, ఉలవలు, బఠాణీ, పిల్లిపెసర, జనుము ఉపయోగకరంగా ఉంటాయి.

నత్రజని

నత్రజని మొక్కల జీవిత కాలమంతా అవసరమే. మొక్క పెరుగుదలకు దుగ్గు కట్టడానికి అవసరం. నత్రజనితో ప్రొటీన్ శాతం పెరుగుతుంది.

పచ్చి ఆకు ఎరువులు

పచ్చిరొట్ట వేసుకోవడం కుదరని పరిస్థితిలో దగ్గరలో ఉన్న చెట్ల ఆకులను, లేతకొమ్మలను తీసుకొని వచ్చి పొలంలో కలపాలి. పచ్చి ఆకు ఎరువుకు అనువైన పంటలు జిల్లేడు, సీతాఫలం, వెంపలి, తంగేడు, తగరంచ, బాడిశ తదితర మొక్కలను చేలో వేసుకోవచ్చు. వరి పొలాల్లో వేసుకునేందుకు అనువైన పప్పు ధాన్యాలు–పెసర, అలసంద, శనగ, సోయాచిక్కుడు, వేరుశనగ, కంది వేసుకోవచ్చు.

– రజినికుమారి, వ్యవసాయాధికారి, విజయపురం

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పుత్తూరు: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 30వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎం.మంజునాథగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. పురపాలక సంఘ కార్యాలయంలో చైర్మన్ ఎ.హరి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

ప్లాట్ల క్రమబద్ధీకరణకు మరో అవకాశం

పుత్తూరు: గత జూన్ 30 వ తేదీ లోపు అనధికార లే–అవుట్లలో కొనుగోలు చేసిన ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడానికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.మంజునాథ్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఈనెల 26వ తేదీన విడుదల చేసిన ఉత్తర్వుల మేరకు 90 రోజుల్లోపు, అంటే 2025 అక్టోబర్ 24వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అయితే ప్రభుత్వ నిబంధనల మేరకు తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడానికి పటిష్టమైన ఆధారాలను సమర్పించాల్సి ఉంటుందని వెల్లడించారు. వివరాల కోసం పురపాలక సంఘ వెబ్‌సైట్‌లో గానీ, కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీమా పథకం వినియోగించుకోండి

విజయపురం: ఖరీఫ్‌కు సంబంధించి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద పంట బీమా పథకం సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రజిని కుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని రైతులు ఖరీఫ్‌కు సంబంధించి ఎకరా వరికి రూ.840 బీమా కట్టాలని తెలిపారు. వచ్చే నెల ఆగస్టు 15లోపు చెల్లించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు స్థానిక ఆర్‌ఎస్‌కే కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

చిరుధాన్యాల వైపు రైతుల చూపు

విజయపురం: ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట చేతికి అందేలోపు లాభాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో భూములను బీల్లుగా పెట్టలేక తక్కువ నీటితో సాగు అయ్యే సజ్జ సాగు వైపు ఆసక్తి చూపుతున్నారు. విజయపురం మండంలో మొత్తం 240 హెక్టార్లలో సజ్జ సాగులో ఉంది. పన్నూరు, ఆలపాకం, మాధవరం, కాళికాపురం, కలియంబాకం, జగన్నాథపురం, ఎల్లసముంద్రం, తెల్లగుంట తదితర గ్రామాల్లో సజ్జ సాగు చేశారు. అంతే కాకుండా తక్కువ నీటితో అధిక దిగుబడితోపాటు ఆశించిన స్థాయిలో లాభం రావడంతో రైతులు ఈ సాగుపై ఆసక్తి చూపినట్లు అధికారులు చెబుతున్నారు.

స్త్రీనిధిని మెరుగు పరచాలి



ఐకేపీ కార్యాలయంలో మాట్లాడుతున్న కల్పలతరెడ్డి

పాలసముద్రం: ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు సత్వర రుణాలను అందిస్తూ లాభాల బాటలో నడుస్తున్న ఏకైక సహకార సంస్థ స్త్రీనిధి అని ఐకేపీ ఏపీఎం కల్పలత రెడ్డి తెలిపారు. మంగళవారం ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఏపీఎం కల్పలతరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఎక్కువ రుణాలు అందించేలా స్త్రీనిధి సంస్థను మెరుగు పరిచే బాధ్యత మహిళలపై ఉందన్నారు. బ్యాంకు లింకేజీల ద్వారా అందిస్తున్న వడ్డీలేని రుణాలను సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. గ్రూప్‌లో తీసుకుని పలు రకాల రుణాలను కొట్టివేతలు లేకుండా రికార్డు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, సంఘమిత్ర, శోభ, మంజుల, మురగయ్య, బాలయ్య పాల్గొన్నారు.

సమాచార హక్కు ఓ ఆయుధం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కార్వేటినగరం: సమాచార హక్కు చట్టం వినియోగదారులకు ఒక వజ్రాయుధమని ఎంపీడీఓ చంద్రమౌళి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు, కార్యదర్శులకు, సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వినయోగదారులు సమాచార హక్కు చట్టం ద్వారా కోరిన సమాచారాన్ని సంబంధిత అధికారులు నిర్ణీత సమయంలో అందించడానికి కృషి చేయాలన్నారు. లేకుంటే ఉన్నతాధికారుల నుంచి ఉద్యోగ పరంగా ఇబ్బందులు తప్పవన్నారు. సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం నిర్ణీత సమయానికి సమాచారం అందించక పోవడంతో పలు ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా కార్యాలయానికి వచ్చిన వినియోగదారులతో స్నేహపూర్వకంగా మెలిగి వారికి కావాల్సిన సమాచారాన్ని అందిస్తే ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాల వద్ద సమాచార హక్కు చట్టం బోర్డును తప్పకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మధుసూదన్, ఏఓ విద్యావతి, పంచాయతీ ఈఓ నాగరత్నమ్మ, కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులు సేంద్రియ సాగుకు ప్రాధాన్యమివ్వాలి



సేంద్రియ సాగును పరిశీలిస్తున్న ఏపీపీఎస్‌ఎఫ్ డీపీఎం వాసు

పాలసముద్రం: మండల పరిధిలోని రైతులు సేంద్రియ ఎరువుల వాడకానికి రైతులు ప్రాధాన్యమివ్వాలని చిత్తూరు ఏపీపీఎస్‌ఎఫ్ డీపీఎం వాసు తెలిపారు. మంగళవారం ఎస్‌కేఆర్ పురం పంచాయతీల్లో సేంద్రియ వ్యవసాయంలో సాగు చేస్తున్న పంటలను ఆయన క్షేత్రస్థాయిల్లో పరిశీలించారు. ఏపీపీఎస్‌ఎఫ్ డీపీఎం వాసు మాట్లాడుతూ సేంద్రియ సాగులో రైతులకు ఆర్థికాభివృద్ధి సాధిస్తారన్నారు. తక్కువ పెట్టుబడితో నికర ఆదాయం, నాణ్యమైన దిగుబడి, వస్తుందన్నారు. రసాయన ఎరువుల రేట్లు రోజురోజుకూ పెరిగిపోతుండడమే కాక, ఉత్పత్తులు విషతుల్యమై పోతున్నాయని చెప్పారు. విత్తన శుద్ధికి జీవామృతం, సస్యరక్షణకు గోవు పేడ, మూత్రం, కషాయం తయారు చేసి పంటకు వినియోగించవచ్చన్నారు. రసాయనిక మందుల వాడకం తగ్గించడం తదితర విషయాలపై తరవుగా వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వనజ, అనంతరం సేంద్రియ సాగు పంటలను క్షేత్రస్థాయిల్లో పరిశీలించారు.

నేత్రప్రదాయినికి ప్రత్యేక పూజలు





ఆలయం వద్ద కిక్కిరిసిన భక్తులు , మహిషాసుర మర్ధినిగా దేశమ్మవారు

నగరి: పట్టణ పరిధిలోని నేత్రప్రదాయిని క్షేత్రంలో ఆడి మంగళవారం పూజలను పురస్కరించుకొని ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఈ సందర్భంగా దేశమ్మ దేవతకు మహిషాసుర మర్ధిని అలంకారం చేశారు. ఆడి మంగళవారం ప్రత్యేకం కావడంతో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని, అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు కళ్లలో తీర్థం పోసుకున్నారు. ఆలయం వద్ద అన్నమాచార్య కీర్తనలు, భరత నాట్యం కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. ఆలయ ఈఓ, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి

కార్వేటినగరం: అంగన్‌వాడీ సిబ్బంది విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసి, కార్వేటినగరం ప్రాజెక్టును జిల్లాలో మొదటి స్థానంలో నిలపాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ శోభరాణి అన్నారు. మంగళవారం ఐసీడీఎస్ కార్యాలయంలో గతంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన సీడీపీఓ పద్మసునంద, పర్యవేక్షకులు ఇందిర, షామినితోపాటు సిబ్బంది రామకృష్ణ, కొత్తగా బాధ్యతలు చేపట్టిన పర్యవేక్షకులు రోజారమణి, సిబ్బంది రమేష్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ మురళీ, సిబ్బందిని శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ సిబ్బంది ప్రతి ఒక్కరూ తమకు అక్కాచెల్లెల్లాంటి వారని, ఎవరూ విరోధు కారని తెలిపారు. అనంతరం బదిలీపై గంగాధరనెల్లూరు సీడీపీఓగా వెళ్లిన పద్మసునంద మాట్లాడుతూ కార్వేటినగరం ప్రాజెక్టులో ఏకధాటిగా 6 సంవత్సరాలు పని చేశానని, తనకు ఎలా సహకరించారో అలాగే సీడీపీఓ శోభకు సహకరించి ప్రాజెక్టుకు మరింత మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు కలసి అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది మమత, సుగుణ, రాణి, వళ్లెమ్మ, తేతావతి, నాగమ్మ, మంజుల పాల్గొన్నారు.

నేడు పేదరిక నిర్మూలనపై సమీక్ష

తవణంపల్లె: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు పేదరిక నిర్మూలన అనే అంశంపై సమీక్షా సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. సమీక్షా సమావేశంలో మండల ప్రత్యేక అధికారి సూరిబాబు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొనాలని కోరారు.

వసతి గృహాల్లో సౌకర్యాలు కరువు



జీడీ నెల్లూరులో వసతి గృహంలో వంటగదిని పరిశీలిస్తున్న విద్యార్థి నాయకులు



కార్వేటినగరం వసతి గృహంలో విద్యార్థి నేతల తనిఖీలు

కార్వేటినగరం: కూటమి ప్రభుత్వంలో వసతి గృహాల్లో విద్యార్థులకు సౌకర్యాలు లేకుండా మగ్గుతున్నారని నియోజకవర్గం వైఎస్‌ఆర్ సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఆవుల పవన్ అన్నారు. మంగళవారం రాత్రి నియోజకవర్గంలోని వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పేద విద్యార్థులపై చేపడుతున్న కక్ష సాధింపులు మానుకోవాలని, వారికి సరైన సౌకర్యాలు కల్పించి, విద్యాభ్యాసాలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు తాగేందుకు మినరల్ వాటర్ ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్వేటినగరం ఎస్సీ వసతి గృహంలో మరుగుదొడ్లు ఉన్నా నీటి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, అలాగే స్నానపు గదులు నీళ్ల లేక పోవడంతో ఆరుబయట స్నానాలు చేస్తున్నారని తెలిపారు. ఎస్సీ వసతి గృహాలకు సంబంధించిని నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ అధికార ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలో జాప్యం చేస్తుందని అన్నారు. అనంతరం విద్యార్థులకు స్నేక్స్‌తోపాటు, పండ్ల రసాలను పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ధనుంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, మదన్‌కుమార్‌రెడ్డి, మున్నా, రఫీ, రత్నంరెడ్డి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

జీడీనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: వైఎస్‌ఆర్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం ఆదేశాల మేరకు గంగాధరనెల్లూరు నియోజకవర్గ విద్యార్థి విభాగం నాయకులు జీడీ నెల్లూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని మంగళవారం పరిశీలించారు. నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షుడు పవన్ యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతి సదుపాయాలు కల్పించాలని కోరారు. వెంకటరెడ్డి, కిషోర్ రెడ్డి, ఢిల్లీ కుమార్, గోపి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



ద్రౌపదీదేవి ఆలయం

- ద్రౌపదీదేవికి భక్తుల స్వహస్తాలతో పాలాభిషేకం

పుత్తూరు: శ్రీద్రౌపదీ దేవీ సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు బుధవారం అంకురార్పణ చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6 గంటలకు విఘ్నేశ్వర పూజ, వాస్తు శాంతి, కలశ స్థాపన అనంతరం అంకురార్పణ నిర్వహించనున్నారు. 9 గంటలకు మహిళలు కలశాలతో పాలను ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకువస్తారు. మహిళలు తమ స్వహస్తాలతో అమ్మవారికి పాలాభిషేకం చేయనున్నారు. అనంతరం శ్రీద్రౌపదీ దేవీ సమేత శ్రీధర్మరాజుల స్వామివార్లను పట్టువస్త్రాలతో విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు.

మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భాగవతారిణి పి.స్వర్ణలత హరికథా గానం జరగనుంది. రాత్రి 7 గంటలకు విఘ్నేశ్వరస్వామిని వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించి, మంగళ వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్ల సందడి నడుమ పట్టణ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు.

బ్రహ్మోత్సవాలు

31.7.25: గురువారం ఉదయం స్వామి అమ్మవార్లకు పుష్పాలంకరణ. శ్రీద్రౌపదీదేవి జనన స్థలమైన చౌటూరు పరిసర గ్రామాల భక్తుల నుండి పసుపు కుంకుమ, చీర, సారెను ఊరేగింపు. సాయంత్రం కామధేనువు వాహనంపై శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి ఊరేగింపు.

01.8.25: ధ్వజారోహణం: ఉదయం 6 గంటలకు గోపూజ, శ్రీకృష్ణ భగవానునికి భక్తులతో పాలాభిషేకం. రాత్రి 9 గంటలకు శాస్త్రోక్తంగా ధ్వజారోహణం.

08.8.25: అర్జున తపస్సు: ఉదయం 6 గంటలకు నంది సేవ, ఆది దంపతులైన శ్రీపార్వతీ పరమేశ్వరులు నంది వాహనారూఢులై అర్జునునికి పాశుపతాస్త్రం. 9 గంటలకు అర్జున వేషధారి తపస్సుమాను అధిరోహించుట. రాత్రి 8 గంటలకు రైల్వే స్టేషన్ వద్ద పాటకచ్చేరి. రాత్రి 9 గంటలకు వరలక్ష్మీ దేవి అలంకరణలో ద్రౌపదీదేవి దర్శనం. రాత్రి 11 గంటలకు మంచినీళ్ల గుంట నుంచి అలుగు ఉత్సవం ఊరేగింపుగా వచ్చి ఆలయంలో ప్రతిష్ట. రాత్రి 1 గంటకు కాళికాదేవికి ఇలావంతుని బలి.

09.8.25: రథోత్సవం: ఉదయం 6 గంటలకు గరుడసేవ ఉత్సవం, శ్రీకృష్ణరాయబారం. మధ్యాహ్నం 3 గంటలకు దుశ్శాసుని, దుర్యోధుని వధ, పాండవ విజయం. సాయంత్రం 4 గంటలకు మహారథోత్సవం.

10.8.25: అగ్నిగుండ ప్రవేశం: ఉదయం 8 గంటలకు కల్పవృక్ష వాహనం, సాయంత్రం 6 గంటలకు అగ్నిగుండ ప్రవేశం. రాత్రి 8 గంటలకు కుంభాగ్రహం నుండి అలుగు. 9 గంటలకు సూర్య ప్రభోత్సవం.

11.8.25: ధ్వజావరోహణం: ఉదయం 7 గంటలకు అగ్నిగుండం శాంతి పూజ, సాయంత్రం 6 గంటలకు అమ్మవారి వసంతోత్సవం. రాత్రి 9 గంటలకు ధ్వజావరోహణం.

భార్య కనిపించడం లేదని భర్త ఫిర్యాదు

పుత్తూరు: తన భార్య శైలజ (25) కనిపించడం లేదని భర్త సురేష్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పుత్తూరు మున్సిపాలిటీ 20వ వార్డు కళ్యాణపురం ఎస్టీ కాలనీకి చెందిన సురేష్ తన భార్య శైలజ ఈ నెల 21 తేదీ రాత్రి 9 గంటల నుంచి కనిపించడం లేదని అదేరోజు నుంచి గ్రామానికే చెందిన యోగేష్(27) అనే వ్యక్తి కూడా కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. బంధువుల వద్ద, చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినా కనిపించకపోవడంతో ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.